# తోటపల్లి
# శ్రీశ్రీశ్రీ వేంకటేశ్వరస్వామి వారి దివ్య చరిత్ర



సేకరణ & కూర్పు

**శ్రీ బెలగాం భీమేశ్వరరావు**

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

**ప్రచురణ - తోటపల్లి టెంపుల్స్ డెవలప్‌మెంట్ సేవాట్రస్ట్**

# తోటపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య చరిత్ర



సేకరణ, కూర్పు : శ్రీ బెలగాం భీమేశ్వరరావు
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

ప్రచురణ తేది : 07.02.2025

ప్రతులు : 5,000

వెల : రూ॥ 30.00 లు

ప్రతులకు : తోటపల్లి టెంపుల్స్ డెవలప్‌మెంట్ సేవాట్రస్ట్
తోటపల్లి
గరుగుబిల్లి మండలం
పార్వతీపురం మన్యం జిల్లా
పిన్ నెం : 535 525

# పుట్టలో నుండి బయల్పడిన స్వామి

భక్తులారా! నిర్మలమైన మనస్సుతో తోటపల్లి శ్రీశ్రీశ్రీ వేంకటేశ్వరస్వామి వారి చరిత్రను చదవండి! వినిపించండి! శ్రీ స్వామి వారి దీవెనలందుకోండి!

అది 1968 వ సంవత్సరం, ఫిబ్రవరి 26, సోమవారం, మహాశివరాత్రి పర్వదినం!

'కారాడ – వీరఘట్టాం' బస్సు పార్వతీపురం నుండి తిరుగు ప్రయాణ మయింది ! పర్వదినం కావున బస్సు నిండా ప్రయాణీకులు కిక్కిరిసి ఉన్నారు. బస్సు నిండు గర్భిణిలా మార్గం వెంట వెళ్తూంది. తోటపల్లి గ్రామం వచ్చింది. ఆ ఊరి ప్రయాణీకులను అక్కడ దించి బస్సు ముందుకు కదిలింది. వేగం అందుకునే లోపే బస్సు హఠాత్తుగా నాగావళి బ్యారేజీ ఎడమకాలువ వైపు ఒరిగింది. క్షణాల్లో అది వంద అడుగులపైనే లోతుగల జొల (లోయ)లో పల్టీలు కొడుతూ పడిపోయింది.

తోటపల్లి గ్రామస్తులు ఆ ప్రమాదం చూసి అక్కడకు పరుగులు తీశారు! బస్సులో ఉన్న ప్రయాణీకులు ప్రాణభయంతో హాహాకారాలు చేస్తున్నారు! గ్రామస్తులు కొందరు సాయం చెయ్యడానికి జొలలో దిగసాగారు. మరికొందరు గ్రామానికి పోయి ప్రమాదం గురించి చెప్పారు. బస్సు పడిన ప్రాంతం తుప్పా డొంకతో నిండి ఉంటుందని గ్రామస్తులకు తెలుసు. కొడవళ్ళు, గునపాలతో ప్రమాదం జరిగిన చోటుకు బయలు దేరారు.

వీళ్ళు అక్కడకు చేరేసరికి అప్పటికే కొంతమంది బస్సులో చిక్కుకున్న ప్రయాణీకులను బయటకు లాగుతున్నారు. విచిత్రమేమంటే ప్రయాణీకులంతా క్షేమంగానే ఉన్నారు. చిన్న చిన్న గాయాలవడం తప్పితే ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు. 'అంత ఎత్తు నుంచి బస్సు లోయలోకి పడడమేమిటి? ఎవరికీ ప్రాణాపాయం జరగకుండా ఉండడమేమిటి? ఏదో అదృశ్యశక్తి తమను కాపాడింద'నే అందరూ భావించారు. ఇంతకు కొన్ని రోజులు ముందు కూడా

ఇలాంటి ప్రమాదమే జరిగింది. అప్పుడు కూడా ఎవరికీ ప్రాణాపాయం జరగలేదు. ఇది కేవలం దైవలీలే అనుకున్నారు.

ప్రమాదం వార్త పార్వతీపురం చేరింది. ప్రభుత్వశాఖలు అప్రమత్త మయ్యాయి. ప్రమాదం జరిగిన చోటుకు అధికారులు చేరారు. సహాయక చర్యలు చేపట్టారు.

బస్సును తీయడానికి వీలుగా గ్రామస్తులు తుప్పాడొంక, గట్టూ పుట్ట ఛేదిస్తున్నారు. ఆ సమయంలో వాళ్ళకు ఒక పుట్ట కనిపించింది. పశువుల కాపర్లు చెబుతుండే పుట్టే అది! ఆ పుట్ట దగ్గర నిత్యం ఒక పాము కాపలా ఉండే విధంగా తిరుగుతుండేదని పశువుల కాపర్లు చాలాసార్లు ఊళ్ళో చెప్పారు. ఆ ప్రాంతమంతా కోలాహలంగా ఉండడం వల్లనేమో పాము ప్రమాద సమయంలో కనిపించలేదు. బస్సు తీయడానికి పుట్ట అడ్డంగా ఉందని గ్రామస్తులు పుట్టను తవ్వ సాగారు. అంతలో గునపాం ఒక రాయిని ఢీ కొన్న శబ్దం పుట్ట నుంచి వినిపించింది. పుట్టమట్టి మరికొంత తీసే సరికి ఒక పెద్దరాయి లాంటిది కనిపించింది. అది శిల్పమేమో అని కొందరికి అనుమానం కలిగింది. రాయి మీద ఉన్న మట్టిని వలిచి చూశారు. అందరి కళ్ళు జిగేల్ మన్నాయి!

అది శిల కాదు, శిల్పం!

శంఖు చక్ర నామాలతో ఉన్న ఒక స్వామివారి విగ్రహం!

అప్రయత్నంగా అందరి నోటి వెంట భగవన్నామం వెలువడింది. భగవన్నామంతో ఆ ప్రాంతం దద్దరిల్లింది.

అక్కడుండే గ్రామ ప్రజలకు ఆ ఊరి వృద్ధుడొకడు పదే పదే చెబుతుండే మాటలు గుర్తుకొచ్చాయి! కొన్ని రోజుల నుంచి ఆ వృద్ధునకు ఒక కల వస్తోందట! ఆ కలలో ఒక తేజస్సు రహదారి పక్కన ఉన్న పుట్టలో దేవుడి విగ్రహం ఉందని చెప్పేదట! ముసలితనం పరాకులో ఆ వృద్ధుడు ఆ మాటలు అంటున్నాడని అతడి మాటలను ఆ గ్రామస్తులు పట్టించుకోవడం లేదు. కాని, కళ్ళ ముందు విగ్రహం కనిపించే సరికి వృద్ధుడి మాటలు నిజమే అని ప్రజలు

నమ్మక తప్పలేదు. చిన్న చిన్న ప్రమాదాలు ఆ ప్రాంతంలో జరగడం వాళ్ళు గుర్తుకు తెచ్చుకున్నారు.

గతంలో కూడా ఒక బస్సు లోయలో పడిపోయింది. అప్పుడు కూడా ఎవరికీ గాయం కూడా కాలేదు. అంటే... జరుగుతున్న ప్రమాదాలు స్వామివారు చేసిన హెచ్చరికలా?! అందరికీ ఒళ్ళు జలదరించినంత పనయింది!!

విగ్రహం వెలిసిందన్న వార్త చుట్టు పక్కల గ్రామాలకు వ్యాపించింది! విగ్రహాన్ని పరిశీలించిన కొంతమంది పెద్దలు శ్రీ చెన్నకేశవస్వామి విగ్రహమన్నారు. మరికొంతమంది శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహమన్నారు.

మర్నాడు ధార్మిక నిపుణులు వచ్చి విగ్రహాన్ని అన్ని విధాలుగా పరిశీలించి నూటికి నూరుపాళ్ళు శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహమే అని తేల్చారు.

కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి తమ ఊరిలో వెలిసినందుకు తోటపల్లి గ్రామస్థులు ఆనందంతో పులకరించిపోయారు. అప్పటికప్పుడు రహదారికి అవతల ఒక పందిరి వేసి స్వామి వారిని ఆ నీడన ఉంచారు. అతి త్వరలో దేవాలయాన్ని నిర్మించాలనుకున్నారు.

రోజులు గడుస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తండోపతండాలుగా ఆ విగ్రహాన్ని చూడడానికి రాసాగారు. దక్షిణలు, కానుకలు పెట్ట సాగారు. అది గమనించిన ఊరి పెద్దలు పందిరి స్థానంలో ఒక పురిపాకను నిర్మించారు. అందులో ఒక హుండీని కూడా ఏర్పాటు చేశారు. భక్తులు మొక్కులు తీర్చసాగారు.

అనతి కాలంలోనే శ్రీ స్వామివారు 'ఆపద మొక్కులవాడు' అనే ఖ్యాతి గడించారు. తోటపల్లి ఊరు ఒక పుణ్యక్షేత్రానికి కేంద్రమైపోయింది.

దేవాలయ నిర్మాణానికి ఇక ఉపేక్షించరాదని ఊరి వాళ్ళు భావించారు. చుట్టు పక్కల గ్రామ పెద్దలతో కలసి 40 మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసుకున్నారు.

వీరఘట్టాం వాస్తవ్యులు డా॥ నల్లాన సాంబశివరావు గారు అధ్యక్షులు గాను, కంబర గ్రామానికి చెందిన శ్రీ మోణంగి లక్ష్మణమూర్తి గారు కార్యదర్శి

గాను, తోటపల్లి గ్రామ వాస్తవ్యులు శ్రీ మార్కొండ అప్పలస్వామి నాయుడుగారు కోశాధికారి గాను దేవాలయ నిర్మాణ కమిటీ ఏర్పడింది.

అప్పటి నుంచి దేవాలయ నిర్మాణం కోసం భక్తులు విరివిగా కట్నకానుక లివ్వసాగారు. కమిటీ వారు భక్తులిచ్చిన ధనంతో దేవాలయ నిర్మాణానికి పూనుకున్నారు.

## దేవాలయ నిర్మాణం

పుట్ట నుంచి విగ్రహం తీసే క్రమంలో గునపం తాకిడి వల్ల విగ్రహం కింద భాగంలో చిన్న బీట ఏర్పడింది. ఆ బీటను చూసిన ప్రముఖ వేద పండితులు వీరఘట్టాం వాస్తవ్యులైన శ్రీ సర్వాజోస్యుల లక్ష్మీ నరసింహశర్మ గారు ఆ విగ్రహం ప్రతిష్ఠకు పనికిరాదన్నారు. ఆయన మాటను దేవాలయ వాస్తు పండితులు కూడా బలపరిచారు. నూతనంగా నిర్మించిన దేవాలయంలో నూతన విగ్రహమే ప్రతిష్ఠించి తీరాలని చెప్పారు. కమిటీ వారు వారి ప్రతిపాదనను అంగీకరించారు.

దేవాలయ నిర్మాణానికి స్థలం అవసరం! స్థల సేకరణకు కమిటీ సభ్యులు ప్రయత్నాలు ఆరంభించారు.

కమిటీ ట్రెజరర్‌గా ఉన్న శ్రీ మార్కొండ అప్పలస్వామి నాయుడు గారు ముందుకొచ్చారు.

తమ రక్తసంబంధీకులైన కీ.శే. మార్కొండ జోగినాయుడు, మార్కొండ కన్నంనాయుడు, తోటంనాయుడు కుటుంబ సభ్యులను కలసి వారి ఉమ్మడి ఆస్తిగావున్న 2.53 యెకరాల పొలాన్ని కోరగా వారు ఇవ్వడానికి సమ్మతించారు. అక్కడితో ఆగకుండా తమ దాయాదులైన శ్రీ మార్కొండ సత్యంనాయుడు, శ్రీ మార్కొండ చినగౌరునాయుడు, శ్రీ మార్కొండ పెదగౌరునాయుడు, శ్రీమతి డొల్లు గంగమ్మ గోపినాయుడు, మున్నగువారిని సంప్రదించి మరో 2.72 యెకరాల పొలాన్ని దానం చేశారు.

ఇలా ఉమ్మడి ఆస్తులే కాకుండా శ్రీ మార్కొండ అప్పలస్వామి నాయుడు, శ్రీ మార్కొండ సత్యంనాయుడు చెరో 34 సెంట్లు భూమిని స్వామివారి దీపధూప

నైవేద్యాల కోసం దానం చేశారు.

ఇక మిగిలిన దాతల గురించి ముచ్చటిద్దాం. 'దేవుడు పెళ్ళికి అందరూ పెద్దలే' దైవ కార్యం నిమిత్తం ఇచ్చిన వారి పేర్లు ఒకసారి మననం చేసుకుందాం. ఆ పుణ్యమూర్తుల పేర్లు అనుకోవడం తప్పు కాదు కదా!

తోటపల్లికి చెందిన శ్రీ మార్కొండ సన్యాసినాయుడు కుమారుడు శ్రీ మార్కొండ అప్పలస్వామి నాయుడు 0.44 సెంట్లు, గౌరీపురం గ్రామానికి చెందిన శ్రీ సంబంగి శివున్నాయుడు, శ్రీ సంబంగి పారినాయుడు, శ్రీ సంబంగి అప్పలస్వామి నాయుడు కలసి ఉమ్మడిగా 0.50 సెంట్లు; నవిరి గ్రామానికి చెందిన అన్నదమ్ములు శ్రీ మానాపురం శివున్నాయుడు, శ్రీ మానాపురం పాపినాయుడు ఉమ్మడిగా 0.93 సెంట్లు; నందివానివలసకు చెందిన శ్రీ గొల్లు జగన్నాథం నాయుడు 0.29 సెంట్లు; అదే గ్రామానికి చెందిన శ్రీ గొల్లు శివున్నాయుడు 0.50 సెంట్లు; శ్రీ రెడ్డి రామినాయుడు 0.12 సెంట్లు ; సుంకి గ్రామానికి చెందిన శ్రీమతి జమితిరెడ్డి యరకమ్మ నాయురాలు 0.25 సెంట్లు ; సంతోషపురానికి చెందిన శ్రీ నఖిరెడ్డి పాపినాయుడు, శ్రీ నఖిరెడ్డి సింహాచలం నాయుడు, శ్రీ నఖిరెడ్డి జోగినాయుడు, శ్రీ నఖిరెడ్డి కాశినాయుడు కలసి ఉమ్మడిగా 1 ఎకరా 35 సెంట్లు ; సింగనాపురానికి చెందిన శ్రీ గంట కృష్ణంనాయుడు, శ్రీ గంట గౌరునాయుడు, శ్రీ గంట సోమినాయుడు, శ్రీమతి నఖిరెడ్డి సుబద్రమ్మ నాయురాలు కలసి ఉమ్మడిగా 1 ఎకరా 15 సెంట్లు ; కుదమ గ్రామానికి చెందిన శ్రీ పట్నాయకుని లక్ష్మణమూర్తి 0.33 సెంట్లు ; నవిరి గ్రామానికి చెందిన శ్రీ మానాపురం శివున్నాయుడు, శ్రీ మానాపురం పాపినాయుడు 0.93 సెంట్లు, గదబవలస గ్రామానికి చెందిన శ్రీ సీమల జగ్గులు 0.50 సెంట్లు స్వామి వారి రాగభోగాలకు కానుకగా ఇచ్చారు.

కమిటీ వారు చుట్టు ప్రక్కల గ్రామాలకు వెళ్ళి విరాళాలు సేకరించ సాగారు.

'ఇంటికో పువ్వు ఈశ్వరుడికి దండ' నానుడి తోటపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయ నిర్మాణం విషయంలో నిజమయింది!

విరాళాల వెల్లువతో పాటు పుట్టుదేవుని హుండీలో పడిన కట్నకానుకలను కలిపి దేవాలయ కమిటీ వారు దేవాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

శర వేగంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయం, శ్రీ పద్మావతి అమ్మవారి దేవాలయం నిర్మాణాలు జరగసాగాయి. ఆ సమయంలో తిరుపతి నుంచి ప్రముఖ ఆగమ పండితులు శ్రీ పార్థసారథి భట్టాచార్యులు వారు తరచూ వచ్చి సూచనలిస్తుండేవారు.

దేవాలయాల నిర్మాణం పూర్తయింది. ప్రధాన దేవాలయానికి ఇరు వైపులా రెండు కళ్యాణ మండపాలు, భక్తుల కేశఖండన మొక్కులు తీర్చుకునే నిమిత్తం కళ్యాణకట్ట, చౌటరీ పథకం కింద 34 విశ్రాంతి గదులు నిర్మించారు.

పై కట్టడాలే కాకుండా భక్తుల బస కోసం 3 కాటేజీలను వ్యాపారస్తుల కోసం దుకాణ సముదాయాలను నిర్మించారు.

అర్చకుల కోసం 6 నివాస గృహాలు నిర్మించారు.

అనేక రకాల కట్టడాలతో దేవాలయ పరిసరాలు చాలా ఆకర్షణీయంగా కనిపించసాగాయి.

వేద పండితులు, పంచాంగ కర్తలు విగ్రహ ప్రతిష్ఠకు సుముహూర్తం నిర్ణయించారు.

ఆ శుభ దినం శ్రీ విరోధి కృత నామ సంవత్సరం, దక్షిణాయనం, మాఘ శుద్ధ ఏకాదశి పర్వదినం 1972 సంవత్సరం, జనవరి నెల 26వ తేదీ ! ఢిల్లీలో రాజ్యాంగానికి పట్టాభిషేకమైతే తోటపల్లి శ్రీశ్రీశ్రీ వేంకటేశ్వరస్వామి వారికి పట్టాభిషేకం తోటపల్లిలో జరిగింది. తిరుపతి నుంచి తెచ్చిన విగ్రహాలకు పాంచరాత్ర ఆగమ శాస్త్ర రీతిలో పూజలు జరిపి ప్రాణ ప్రతిష్ఠ చేసి గర్భాలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, ఆగమ పండితులు చాలా మంది పాల్గొన్నారు. వారి వేద మంత్రాలతో తోటపల్లి గ్రామం ప్రతిధ్వనించింది !

అప్పటి నుంచి తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం నిత్య

కళ్యాణం పచ్చతోరణంలా వెలిగిపోసాగింది.

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిస్సా రాష్ట్ర సరిహద్దు గ్రామాల నుంచి కూడా తండోప తండాలుగా భక్తులు రాసాగారు.

## క్షేత్రమహిమ

కాల గమనంలో భక్తుల మనోభావాలకు చిరునామాగా తోటపల్లి దేవాలయం ప్రసిద్ధిగాంచింది.

తోటపల్లి దేవుని సన్నిధిలో తమ పిల్లలకు వివాహం చేస్తే భార్యా భర్తల అన్యోన్యత, సంతాన సౌభాగ్యం సిద్ధిస్తుందని భక్తులకు నమ్మకం ఏర్పడింది. అందువల్ల పేదల నుంచి శ్రీమంతుల దాకా తోటపల్లి దేవాలయ కళ్యాణ మండపాల్లో వివాహాలు చెయ్యాలని ఉవ్విళ్ళూరుతుండేవారు. భక్తుల నమ్మకానికి తగ్గట్టుగానే అక్కడ జరిగే వివాహాలు దాంపత్య బంధానికి ప్రతీకగా విలసిల్లుతుండేవి. ఒక్కొక్క సారి ఒకే రోజు గరిష్ఠంగా నలభై పెళ్ళిళ్ళు కూడా జరిగే సందర్భాలు ఉంటుండేవి. అందుకే తోటపల్లి పావన క్షేత్రంలో వెలిసిన శ్రీ స్వామి వారిని ఇప్పటికీ 'శ్రీ కళ్యాణ వేంకటేశ్వరుడు' అని కూడా భక్తులు పిలుస్తుంటారు.

ఈ క్షేత్రం మహిమలకు కాణాచి అని భక్తులు పేర్కొంటారు. కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా ఈ క్షేత్రాన్ని భక్తులు భావిస్తారు. పిల్లలకు నిండు ఆయుర్దాయం, విద్యాబుద్ధులు సిద్ధిస్తాయని తమ పిల్లల పుట్టు జుత్తును ఇక్కడ కళ్యాణ కట్టలో భక్తులు సమర్పించుతారు. 'ఆపద మొక్కుల వాడు – తోటపల్లి దేవుడు' అన్న నానుడి ప్రజల నాలుకలమీద నానుతుంది. అందుకే శనివారం రోజున వందలాది మంది తలనీలాలు సమర్పించుకుంటున్నారు.

చదువులు పూర్తయి ఉద్యోగార్థం నిరీక్షించే వారు తోటపల్లి దేవుడిని దర్శించుకుంటే చాలు, వారిలో మేధోబలం వృద్ధి చెంది ఉద్యోగ పరీక్షల్లో విజయం సాధిస్తారని కూడా ప్రజల్లో ఈ దేవుడి పట్ల విశ్వాసముంది!

ఆ విశ్వాసం, నమ్మకం భక్తుల్లో ఉండడం వల్లే దైవబలం కూడా తోడై భక్తులపై ప్రభావం చూపుతుందని పెద్దలంటారు. ఇందుకు ఋజువుగా

ఒకరిద్దరి స్వానుభవాలను చెప్పుకుందాం.

## స్వానుభవాలు

ఒక క్షేత్రం అచిరకాలంలో ఖ్యాతికెక్కడానికి ఆకర్షణీయ దేవాలయ నిర్మాణం, ప్రకృతి శోభ, అక్కడ జరిగే పూజా విధానాలు, ఆలయ నిర్వాహకులు అక్కడకు వచ్చే భక్తులపట్ల తీసుకున్న శ్రద్ధ ఇవన్నీ కారణాలు అయినప్పటికీ క్షేత్రంలో వెలసిన దేవుడి యొక్క లీలలు అమోఘమైన ప్రాచుర్యాన్ని తీసుకువస్తాయి.

భారతదేశంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు ఎటువంటి మహిమలున్నాయో అటువంటి మహిమలే తోటపల్లి పుణ్యక్షేత్రానికి కూడా ఉన్నాయి.

ఆ మహిమలు తెలుసుకుందాం.

తోటపల్లి నివాసి కీ.శే. శ్రీ మార్కొండ చినగౌరునాయుడు, ఆలయ స్థలదాతల్లో ఒకరు. వివాహ ముహూర్తాలున్న రోజుల్లో దేవాలయంలో చాలా వివాహాలు జరగడం చూసి ఆయన "నా కుమారుని పెళ్ళి ఈ దేవాలయంలోనే చేస్తాను" అని మనసులో అనుకున్నారు కాని కాలగమనంలో ఆయన ఆ మాటను మరచిపోయి ఇంటి వద్దే కుమారుని పెళ్ళి ఏర్పాట్లు చేయసాగారు. పెళ్ళి రోజు వచ్చింది. పెళ్ళి కుమార్తె బంధువులు వచ్చారు. పెళ్ళి తంతులు ఒక్కొక్కటి జరుగుతున్నాయి. కాలిగోటి సంబరమయింది. నూతన వధూవరుల మంగళ స్నానాలు పూర్తయ్యాయి. మరికొన్ని గంటల్లో పెళ్ళి ముహూర్తం రానుంది. హఠాత్తుగ పెండ్లి కుమారుడికి అనారోగ్యం చేసింది. విపరీతమైన జ్వరం వచ్చింది. శరీరమంతా వాతం కమ్మేసింది. కాళ్ళూ చేతులు పట్లు పట్టాయి. కాలు కదపలేని పరిస్థితి వచ్చింది. పెళ్ళి జరపడానికి బంధువులు సందిగ్ధంలో పడ్డారు. పెళ్ళి కుమారుని ఆరోగ్యంపై అనేక అపోహలు కలిగాయి. మార్కొండ చిన గౌరునాయుడు గారికి కాళ్ళూ చేతులూ ఆడటం లేదు.

దు:ఖంతో ఆయన మనస్సు భారమయింది. అలాంటి సమయంలో నూతన వధూవరులను ఆశీర్వదించడానికి తోటపల్లి దేవస్థానం ఛైర్మన్ డా॥ నల్లాన సాంబశివరావు గారు వచ్చారు. పెండ్లి కుమారుని పరిస్థితి చూసి ప్రాధమిక చికిత్స చేశారు. చిన గౌరునాయుడు గారి వద్దకు వెళ్ళి "మీరు మీ కుమారుని పెండ్లిని మన దేవాలయంలో చేస్తానని అన్నట్టు నాకు గుర్తు ! మరి ఇప్పుడు ఇంటి వద్ద ఎందుకు చేస్తున్నారు ? స్వామి వారికి ఆగ్రహం కలిగిందేమో ! స్వామి వారు చాలా మహిమ కలవారు ! ఎన్నెన్నో లీలలు ఇటీవలే బయట పడుతున్నాయి ! మీరు కాళ్ళు చేతులు కడుక్కొని తప్పులను మన్నించండని మొక్కండి. పెళ్ళిని దేవాలయంలో చేస్తానని స్వామి వారికి మనవి చేసుకోండి" అని సలహా ఇచ్చారు. డాక్టరు గారు చెప్పినట్టే చినగౌరు నాయుడు చేశాడు. విచిత్రం ! పెండ్లి కుమారుని జ్వరం క్షణాల్లో ఎగిరిపోయింది ! మరి కాసేపటిలో కాళ్ళూ చేతుల పట్లు విడిపోయాయి ! లేచి తిరుగాడ సాగాడు ! బంధువులంతా ఆశ్చర్యపోయారు. ఆరోజు రాత్రి అనుకున్న ముహూర్తానికే తోటపల్లి శ్రీ వేంకటేశ్వరుని సన్నిధిలో ఉన్న కళ్యాణ మండపంలో పెళ్ళి జరిగింది.

పెండ్లి కుమారుడైన పకీరు నాయుడుకు స్వామి వారిపై ఎనలేని గురి ఏర్పడింది. 1978 లో ఈ సంఘటన జరిగింది. అప్పటి నుంచి పకీరునాయుడు రోజూ స్వామి వారి దర్శనం చేసుకుంటాడు. ఎక్కువ సమయం స్వామి వారి సేవలోనే గడుపుతాడు. ప్రతి శనివారం దేవస్థానంలో జరిగే అన్నదాన కార్యక్రమంలో ముఖ్య సేవకుడిగా బాధ్యత నిర్వహిస్తాడు. 'స్వామి వారి మహిమను ప్రత్యక్షంగా అనుభవించాను. నా జీవితం ధన్యమైంది ! " అని ఆ సంతోషాన్ని అందరితో పంచుకుంటాడు.

ఇంకొక మహిమ గురించి తెలుసుకుందాం ! శ్రీ బరాటం గుంపసోమేశ్వరరావు గారి స్వస్థలం కురుపాం ! వయోవృద్ధులే అయ్యారు

! అయినా ధార్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు ! తోటపల్లి దేవాలయ ఉద్ధరణకు " తోటపల్లి టెంపుల్స్ డెవలప్‌మెంట్ సేవాట్రస్ట్ " ఏర్పడినట్టు ఆయనకు తెలిసింది. ట్రస్ట్‌లో శాశ్వత సభ్యత్వం తీసుకోవాలని మనసులో అనుకున్నారు. పనుల్లో పడి ఆయన ఆ విషయం అశ్రద్ధ చేశారు. ఒకరోజు రాత్రి శ్రీ తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆయనకు కనిపించి "మొదట నుంచీ నీవు నా భక్తుడివి ! మంచి పనులు చేయడానికి ముందుండే మనిషివి ! చాలా ధార్మిక సంస్థలకు, సంఘసేవకు నీశక్తి కొలది వితరణ చేస్తున్నావు ! మరి నా విషయంలో శాశ్వత సభ్యత్వం పొందడానికి ఎందుకు తాత్సారం చేస్తున్నావు ?" అని అన్నారు. మెలకువ వచ్చిన గుంప సోమేశ్వరరావు గారు తప్పయిందని లెంపలేసుకున్నారు. మర్నాడు తోటపల్లి వెళ్ళి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఇప్పుడు స్వామి వారి దేవాలయ పనుల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఇలా భక్తుల అనుభవాలు చెప్పుకుంటూపోతే పెద్ద గ్రంథమే ఔతుంది.

## రోజువారీ కార్యక్రమ విశేషాలు

'చిన్న తిరుపతి'గా ప్రసిద్ధికెక్కిన తోటపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో ప్రతి యేటా మాఘ శుద్ధ ఏకాదశి పర్వదినాన **శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవం** అంగరంగ వైభవంగా జరుగుతుంది.

ఆశ్వీయుజ మాసంలో ఇక్కడ 'పవిత్రోత్సవాలు' అనే వేడుక జరుగు తుంది. సంవత్సరం పొడువునా మానవుల వలన గాని జంతువుల వలన గాని పక్షుల వలన గాని ఏమైనా అపచారాలు జరిగితే వాటి వల్ల అశుభం కలగకుండా ఆలయశుద్ధి చేస్తారు. దీనినే పవిత్రోత్సవం అంటారు.

పైన చెప్పిన ఉత్సవాలే కాకుండా శ్రీ వినాయక చవితి, శ్రీ కృష్ణాష్టమి, దసరా, ధనుర్మాస ఉత్సవాలు, ఉగాది పంచాంగ శ్రవణం, శ్రీరామ నవమి నవరాత్రులు, శ్రీరామ వార్షిక కళ్యాణం జరుగుతుంటాయి !

గ్రహణ సమయాల్లో సంప్రోక్షణ కార్యక్రమం జరుగుతుంది. గ్రహణ

శుద్ధికోసం వేలాదిమంది భక్తులు ఆలయం పక్కనున్న నాగావళి నదిలో స్నానం చేసి స్వామి వారిని దర్శించుకుంటారు. అంతేకాదు, కార్తీక మాసం తరువాత వచ్చే **'పోలిపాడ్యమి'** నాడు విశేషంగా భక్తులు ఇక్కడకు వచ్చి నదీస్నానం చేసి 'దీపోత్సవం' జరుపుతుంటారు. ఆరోజు వేకువ జామున నదీ ప్రవాహంలో అరటిదొప్పల మీద వెలుగుచున్న దీపాలు కుప్పలు తెప్పలుగా కనిపించి చూపరులకు నేత్రానందం కలుగుతుంది.

ఈ ఉత్సవాలే కాకుండా శ్రావణ మాసంలో శ్రీ పద్మావతి అమ్మవారికి 'లక్ష కుంకుమార్చన' పూజ జరుగుతుంది. కార్తీక మాసంలో 'లక్ష తులసి దళార్చన' జరుగుతుంది.

ప్రతి రోజు దేవాలయంలో ఉదయం గం॥ 10 లకు స్వామి వారికి నిత్య కళ్యాణం జరుగుతుంది. మూడు పూటలు త్రికాలహోమం జరుగుతుంది. స్వామి వారికి అమ్మవారికి మధ్యాహ్న సమయంలో 'నిత్య రాజ భోగం' నివేదన సమర్పిస్తారు.

దూర ప్రాంతం నుంచి వచ్చే భక్తులకు నిత్యాన్నదాన పథకం ద్వారా ప్రతి శనివారం భోజన సదుపాయం కల్పిస్తారు. ఆ అన్నప్రసాదాన్ని భక్తులు పరమ ప్రసాదంగా భావించి స్వీకరిస్తారు.

## దేవాదాయ శాఖ ఆధీనంలోకి దేవాలయం

1980 సం॥ వరకు సుమారు పుష్కర కాలం కమిటీ వారే దేవాలయ నిర్వహణ చేపట్టారు. ఆ తరువాత అంటే 1980-81 సం॥లో ప్రభుత్వ దేవాదాయశాఖ ఆధీనంలోకి తోటపల్లి దేవాలయాలు వచ్చేశాయి. అప్పటి వరకు దేవాలయాల నిర్వహణ చూస్తున్న కమిటీ రద్దయింది. ప్రభుత్వ కార్య నిర్వహణాధికారి ద్వారా దేవాదాయశాఖ దేవాలయ విధులు నిర్వహించ సాగింది. కొత్త కమిటీని ఏర్పాటు చేశారు. ఆ సభ్యులతో ట్రస్ట్‌బోర్డ్ ఏర్పాటయింది. బోర్డ్ హయాంలోనే ప్రభుత్వ దేవాదాయశాఖ పాతబడిన దేవాలయాల స్థానంలో నూతన దేవాలయాలను నిర్మించడానికి ఉపక్ర మించింది. సర్వశ్రేయోనిధి నుంచి 83,00,000 రు॥లు అక్షరాల ఎనభై

మూడు లక్షల రూపాయలు మంజూరు చేయించ గలిగింది. మంజూరైన నిధి ద్వారా ప్రధాన దేవాలయం, శ్రీదేవి భూదేవి ఉపదేవాలయాలు మరియు ధ్వజస్తంభ నిర్మాణం, 3 అర్చక నివాస గృహ సముదాయం నిర్మించ తలపెట్టింది.

వాస్తుదోషం పేరుతో యాభై సంవత్సరాల కిందట కట్టిన దేవాలయాన్ని పడదోశారు. ఇక నూతన దేవాలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి కాగలదని భక్తులు ఆశ పడ్డారు. కాని, వారి ఆశ నిరాశయింది ! దేవాలయ నిర్మాణంలో అలసత్వం చోటు చేసుకుంది. కారణాలు అనేకం. పునాది, శ్లాబు వరకు వచ్చి దేవాలయ నిర్మాణం ఆగిపోయింది. సంవత్సరాలు గడుస్తున్నా నిర్మాణ పనులు ముందుకు కదలలేదు.

చిన్న తిరుపతి కోలాహలం సద్దు మణిగింది. వేడుకలు వైభవాన్ని కోల్పోయాయి. “ఏవి తల్లీ, నిరుడు కురిసిన హిమసమూహములు?” అన్న మహాకవి మాటలు నిజమయ్యాయి. పాతకాలం నాటి దేవాలయ వైభవాన్ని గుర్తు తెచ్చుకొని భక్తులు మనోవేదనకు గురయ్యారు. కళకళలాడుతూ కనిపించే సింహద్వారాలు, విగ్రహాలు రంగు వెలసి కళా విహీనంగా కనిపించ సాగాయి. వేలాదిమంది భక్తులిచ్చే విరాళాలతో నిర్మించిన దేవాలయాలు, కాటేజీలు, మండపాలు శిధిలావస్థకు చేరి భక్తుల మనసులను కల్లోల పరిచాయి. దేవాలయ పరిసరాలలో ఉండే పూదోటలు కనుమరుగైపోయాయి.

ఆ సమయంలోనే దేవాలయ ప్రాంగణంలో ఉన్న బ్యాంకు భవనం శిధిలావస్థలో ఉండడం వలన ప్రక్క గ్రామానికి తరలించడానికి అధికారులు సమాయత్తమవుతున్నారు. బ్యాంకు వెళిపోతే ఈ చుట్టుప్రక్కల ప్రజలు చాలా యిబ్బందులు పడతారని ఎలాగైనా బ్యాంకును తరలించడం ఆపాలని ప్రముఖ సామాజికవేత్త, జట్టుట్రస్ట్ వ్యవస్థాపకులు డా॥డి.పారినాయుడు భావించారు. ఒకరోజు ప్రజలతో కలసి ధర్నా చేశారు. అప్పుడు బ్యాంకు ఛైర్మన్‌గారు 3 నెలల్లో భవనం కట్టి యిస్తే బ్యాంకును తరలించము అన్నారు. వెంటనే పారినాయుడు చుట్టుప్రక్కల ప్రజల సహకారంతో 12 లక్షల రూపాయలు పోగుచేసి కొత్త భవనం నిర్మించారు. ఆ భవనాన్ని అప్పటి తిరుమల తిరుపతి

దేవస్థానం ఈఓగా వున్న శ్రీ ఎల్.వి. సుబ్రహ్మణ్యంగారితో ప్రారంభించారు. కానీ శిథిలమైన దేవాలయం గురించి మాత్రం ఆలోచించలేదు. ఎందుకంటే పారినాయుడు ఒక నాస్తికుడు. ఇలా పదేళ్ళు గడిచాయి.

## నాస్తికుడు ఆస్తికుడైన వైనం

కొత్తగా కట్టబోతున్న దేవాలయంలో చోటు చేసుకున్న అస్తవ్యస్త పరిస్థితులు చూసి డొల్లు పారినాయుడు గారు నొచ్చుకున్నారు. కొంతమంది పెద్దలను కలసి దేవాలయ ఉద్ధరణ కోసం ప్రయత్నించారు. ఈ ప్రయత్నాలు ఫలితమివ్వలేదు. నిర్లక్ష్యానికి గురయిన దేవాలయాన్ని పునర్‌నిర్మించవలసిన అవసరాన్ని ప్రభుత్వ పెద్దలను కోరుతూ ఒక ప్రకటన యిచ్చారు.

అదే రోజు రాత్రి ఆయనకు గొప్ప తేజస్సుతో నిండిన ఓ పెద్దమనిషి కలలో కనిపించి "దేవాలయ ఉద్ధరణకు ప్రభుత్వాలే చేయాలా? లక్షలాదిమంది భక్తులు నా కోసం వచ్చి పూజలు చేస్తారు కదా! మీరందరూ కలసి నా నివాసం కోసం ఒక చిన్న గుడిసెను కూడా కట్టలేరా?" అనే మాటలు వినిపించాయి.

ఆ కలను పారినాయుడు గారు మొదట పెద్దగా పట్టించుకోలేదు. దేవాలయ నిర్మాణ తలపులలో ఉండడం వల్లే ఆ కల వచ్చిందనుకున్నారు. కాని, అదే కల మరో రెండు రోజులు వరుసగా వచ్చింది. ఈ సంఘటనతో నాస్తికులైన పారినాయుడు గారి మనస్సు మారింది. దేవుడిపై నమ్మకం కుదిరింది. ప్రకృతే దేవుడని నమ్మి దేవాలయానికి వెళ్ళి చేతులు జోడించని పారినాయుడు గారు ఆరోజు శ్రీ వేంకటేశ్వ స్వామి దేవాలయానికి వెళ్ళి నిండు మనసుతో నమస్కరించారు. కూల్చి వేసిన భవన శిథిలాలను గమనించారు. పనులు నిలిచిన కట్టడాలను చూశారు. తన బాల్యం నాటి దేవాలయ వైభవాన్ని గుర్తుకు తెచ్చుకొని చాలా క్షోభ పొందారు.

కేవలం ప్రభుత్వం మీద ఆధారపడ్డం వలన దేవాలయ పునరుద్ధరణ సాధ్యం కాదని, భక్తులు, దాతల సహకారంతో పూర్వవైభవాన్ని తీసుకురావాలని గట్టి నిర్ణయం తీసుకున్నారు పారినాయుడు. ఆ నిర్ణయం ఫలితంగా 2023 సంవత్సరం జనవరి 12న స్వామి వివేకానంద పుట్టినరోజు నాడు పార్వతీపురం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 'తోటపల్లి టెంపుల్స్ డెవలప్‌మెంట్ సేవాట్రస్ట్" అనే సంస్థ ఆవిర్భవించింది. శ్రీ ద్వారపురెడ్డి ధనుంజయరావును మేనేజింగ్ ట్రస్టీగా పెట్టి 40 మందితో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. సంస్థ యొక్క కమిటీ వారు దేవాలయాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేయాలని ప్రతిపాదించుకున్నారు.

అవి :

రాజగోపురానికి ఇరువైపులా వినాయక గుడి, ఆంజనేయ స్వామి గుడి నిర్మాణం;

ఆ పక్కన చదువుల తల్లి సరస్వతీ దేవికి గుడి;

ప్రధాన దేవాలయం పరిధిలో ఎక్కువ మంది భక్తులు వేచి ఉండుటకు, అవసరాన్ని బట్టి ఎక్కువ వివాహాలు జరుపుకొనుటకు 88 స్తంభాలతో ప్రాకార మండపం;

ప్రాకార మండపంలో ఉన్న ప్రతి స్తంభానికి ఒక దేవతా విగ్రహంతో పాటు సంబంధించిన చరిత్ర నిక్షిప్తం చేయడం;

ప్రధాన దేవాలయం ముందు ఐదంతస్తుల రాజగోపురం;

ప్రతిరోజూ భక్తులకు అన్న ప్రసాదం అందించాలన్న ఆలోచనతో నిత్యాన్నదాన ప్రసాదం ఏర్పాటు;

ప్రధాన దేవాలయానికి ఈశాన్య దిక్కులో అడ్డంగా వున్న చిన్న చిన్న దుకాణాలను తొలగించి పక్కా దుకాణాలు ఏర్పాటు.

పైన చెప్పిన అంశాలు నెరవేర్చడానికి ట్రస్ట్ పలురకాలుగా ప్రయత్నాలు ప్రారంభించింది.

దేవాలయ అభివృద్ధికి బాసటగా ఉన్న విశ్రాంత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం గారి సూచన మేరకు డా॥ డి. పారినాయుడు గారు, సంస్థ కన్వీనర్ దైవ సేవకులు శ్రీ గెంబలి శ్రీరామ చంద్రమూర్తి గారు కలసి విశాఖపట్టణం వస్తూన్న పూజ్య కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి గారి ఆశీస్సులు పొందడానికి వెళ్ళారు. ఇద్దరూ విశాఖపట్టణంలోనే రెండ్రోజులుండి పూజ్య విజయేంద్ర సరస్వతి గారికి తోటపల్లి దేవాలయ

విశిష్టతను, అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులు, తలపెట్టిన కార్యక్రమాలు వివరించి చెప్పారు. వివరాలన్నీ విన్న పూజ్య విజయేంద్ర సరస్వతి గారు విశాఖపట్టణానికి చెందిన శ్రీమతి మునగపాటి వైష్ణవీ వర్మ దంపతుల ద్వారా భూరి విరాళం ప్రకటింపజేశారు. అంతేకాకుండా ఆ పుణ్య దంపతులచే సాక్షి గణపతి, అభయాంజనేయస్వామి వారల ఏకశిలా విగ్రహాలు, రెండు రాతి ద్వారాలు, రాతి పీఠాలు, మార్బుల్స్ వగైరాలు దేవాలయానికి ఇప్పించారు.

బంగారం కోసం వెళ్తే ఏకంగా వజ్రాల మూటే దొరికినంత పనయింది.

తోటపల్లి చేరిన తరువాత పారినాయుడు మాష్టారు విరాళాల సేకరణను ముమ్మరం చేశారు. ప్రతి ట్రస్టీ స్వంత ధనం లేదా విరాళాలు ద్వారా కానీ కనీసం 1 లక్ష రూపాయలు దేవాలయ అభివృద్ధికి నిధులు సమీకరించాలన్న పిలుపుతో 30 మంది అనువంశిక సేవాట్రస్టీలు ఒక్కొక్కరు లక్ష రూపాయలు పైబడి ధన సేకరణకు సహాయం చేసారు.

లఖనాపురం గ్రామస్తులు శ్రీ కిమిడి శ్రీరామమూర్తి కోదండ రామాలయం మరమత్తు పనులు చేపట్టారు. అన్న ప్రసాద సత్రం నిర్మాణానికి ఆర్థిక సహాయం చేసారు.

తణుకు గ్రామానికి చెందిన లక్ష్మీబాలాజీ ఆయిల్స్ ప్రై. లిమిటెడ్ శ్రీ మద్దుకూరి సతీష్ పద్మ దంపతులు దేవాలయానికి రాతి ద్వారాలు, తలుపుల కోసం విరాళం అందించారు.

వీరఘట్టం గ్రామానికి చెందిన శ్రీ ఊణ్ణ జనార్దనరావు గారు వారి సోదరి శ్రీమతి భోగి అరుణా రాణి సూచన మేరకు ధ్వజస్తంభం నిర్మాణానికి విరాళం అందించారు.

పార్వతీపురం పట్టణానికి చెందిన శ్రీ బెలగాం జయప్రకాష్ గారు పునాదులు, స్థంభాలకోసం విలువైన పిక్కరాయి సమకూర్చారు.

పార్వతీపురం పట్టణానికి చెందిన శ్రీ బి.ఎన్.బి. రావు గారు తన స్వంత తోటలో గల టేకు కలపను సమర్పించారు. విశ్రాంత రైల్వేస్టేషన్ మాష్టారు శ్రీ తామాడ పకీరు నాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు శ్రీ సంబంగి

సత్యన్నారాయణ, శ్రీ మోణంగి ప్రకాష్, శ్రీ మార్కొండ వాసుదేవరావు స్వచ్ఛందగా తమ సేవలందిస్తున్నారు.

అదే విధంగా స్థానిక శాసనసభ్యురాలు శ్రీమతి తోయక జగదీశ్వరి గారు, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్రీ ఎ. శ్యామ్‌ప్రసాద్ గారు సహాయ సహకారాలందిస్తున్నారు. దేవాదాయశాఖ కమీషనర్లుగా పనిచేసిన శ్రీయుతులు యం. హరిజవహర్ గారు, శ్రీ ఎస్. సత్యనారాయణ గారు నైతిక మద్దతుతో నూతన దేవాలయం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటుంది.

ఇలా అందరి సహకారంతో ఇప్పటి వరకు 3 కోట్ల విలువగల పనులు ప్రారంభించడం జరిగింది. ఇప్పటికే ప్రధాన దేవాలయం, ఉపదేవాలయాలు, దుకాణ సముదాయం పూర్తి అయ్యాయి... ప్రాకారమండపం, రాజగోపురం, అన్నప్రసాద సత్రం స్వామి వారి కళ్యాణ వేదిక పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో భక్తుల విరాళాలే రెండుకోట్ల రూపాయలు కాగా వడ్డికాసులవాడి పేరు సార్ధకం చేస్తు కోటి రూపాయలుపైగా ఋణాలు తీసుకొచ్చి నిర్మాణాలు కొనసాగిస్తున్నారు.

ఇదండీ..... 'ఉత్తరాంధ్ర చిన్న తిరుపతి' గా వాసి కెక్కిన తోటపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య మంగళ చరిత్ర!

పరమ పావనమైన ఈ దేవాలయ చరిత్రను చదివిన వారు, విన్న వారు తోటపల్లి నివాసుడు అయిన శ్రీశ్రీశ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపకు పాత్రులై ఆయురారోగ్యాలు, తెలివితేటలు, భోగభాగ్యాలు, కీర్తి ప్రతిష్ఠలు పొందుదురు గాక !

ఓం శాంతి ఓం శాంతి ఓం శాంతి : !

సర్వేజనా: సుఖినో భవంతు !!



❖❖❖❖



